KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 సంచిక 180 | ఆదివారం 01 జూన్ 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-

# అధికారంలో ఉన్నా లేకున్నా

## తెలంగాణ అభివృద్ధే మా అభిమతం : కేటీఆర్


2 లో

**●పిడిఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్ను ప్రారంభించిన కేటీఆర్ ● హైదరాబాద్ ఆటోమొబైల్ హబ్గా ఎదగడం బీఆర్ఎస్ పాలన విజయఫలితం ●విశ్వవేదికపై తెలంగాణ యువత ప్రతిభకు గుర్తింపు ● గూగుల్, అమెజాన్, ఫేస్బుక్ వంటి దిగ్గజాలు హైదరాబాద్ను ఎంచుకోవడం గర్వకారణం : కేటీఆర్**

దిగ్గజ కార్పోరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలు అందించడం మనందరికీ గర్వకారణం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతం అన్న కేటీఆర్, ఇండియా ఫస్ట్, తెలంగాణ ఫస్ట్ అన్నదే తన విధానం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు భారీగా ఉపాధి అవకాశాలు దొరకాలన్నారు. అందుకోసం తమ సర్వశక్తులు ఉపయోగిస్తామన్నారు. ఇంగ్లాండ్ వార్విక్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పిడిఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్ను కేటీఆర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. తెలంగాణ విజయాల గురించి మాట్లాడటానికి ఎల్లప్పుడూ తనకు గర్వంగా ఉంటుందన్నారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చినందుకు PDSL కి ధన్యవాదాలు తెలిపారు. ఆటోమొబైల్ రంగంలో పిడిఎస్ఎల్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. PDSL తమ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించాలని కోరిన కేటీఆర్, ఇంగ్లాండ్లో యూనివర్సిటీ, ఇండస్ట్రీల మధ్య ఉన్న పరస్పర సహకారం తనను ఆశ్చర్యపరిచిందన్నారు.

మెక్లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీలకు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సేవలను అందించే పీడీఎస్ఎల్ సంస్థ, వార్విక్ యూనివర్సిటీలో తన నాలెడ్జ్ సెంటర్ ప్రారంభించుకోవడం తెలంగాణ టాలెంట్కు నిదర్శనం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వినూత్న విధానాలతోనే ఆటోమోటివ్ హబ్గా పూణే, చెన్నైల సరసన హైదరాబాద్ నిలిచిందన్నారు. తమ ప్రభుత్వ కాలంలోనే ఐటీ, లైఫ్ సైన్సెస్తో పాటు ఆటోమోటివ్ రంగంలోనూ తెలంగాణ సత్తా చాటిందన్నారు.



2 లో

## మోగనున్న
# పంచాయతీ ఎన్నికల నగారా

**●జులైలో పంచాయతీ ఎన్నికలు.. ● పది రోజుల గ్యాప్లోనే ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు**

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పంచాయతీ ఎన్నికల నగారా మోగనుంది. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా జులై నెలలో పంచాయతీ ఎన్నికల నిర్వహించేందుకు రంగం సింద్ధం చేసింది ప్రభుత్వం.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జూన్ నెలాఖరున ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది ప్రభుత్వం. ముందుగా ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించి.. తరువాత సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ సింబల్ తో ఉంటాయి కాబట్టి.. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత పది రోజుల గ్యాప్ లోనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు గతేడాది ఫిబ్రవరిలోనే ముగియగా.. దాదాపు ఏడాదిన్నరగా ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,600 కోట్లకు పైగా ఆగిపోయాయి. పాలకవర్గాలు ఎన్నికైతేనే ఈ నిధులు వస్తాయి. ఇక మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు నిరుడు జులై మొదటి వారంలో.. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల గడువు గత నెలలోనే ముగిశాయి.

వీటికి కూడా ఫైనాన్స్ కమిషన్ నిధులు ఆగిపోయాయి.

# వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: భట్టి విక్రమార్క


2 లో

ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, ఈ వర్గాలకు రాజకీయ అధికారం కల్పించాలని కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జరుగుతున్న తెలంగాణ కాంగ్రెస్ ఆదివాసి కార్యకర్తల సమ్మేళనంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ , పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు హాజరైన ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల వారు తలెత్తుకుని ఆత్మగౌరవంతో బతకాలనేది కాంగ్రెస్ లక్ష్యం అని ఈ వర్గాలను దృష్టిలో పెట్టుకునే దేశంలోని అన్ని రకాల వనరులను ఎస్సీ, ఎస్సీ, బీసీలకు ఇవ్వాలనేది కాంగ్రెస్ నిర్ణయించిందన్నారు

# మా పార్టీ నుంచి వెళ్లిన నేతలను వ్యక్తిగతంగా ఎప్పుడూ కలవలేదు

## : హరీశ్రావు

పీసీసీ అధ్యక్ష హోదాలో ఉంటూ మహేశ్కుమార్గౌడ్ చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు విమర్శించారు. భాజపా ఎంపీ ఈటల రాజేందర్తో భారాస నేతలు రహస్యంగా సమావేశమయ్యారంటూ మహేశ్కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు.


2 లో

# కాంగ్రెస్ వంద రోజులలో ఆరు గ్యారంటీలని అటకెక్కించింది..


2 లో

కేంద్ర మంత్రి బండిసంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్ళ కోసం కేంద్రం నిధులు ఇచ్చింది.. అభివృద్ధి పనుల కోసం తెలంగాణ రాష్ట్రానికి రెండు లక్షల కోట్లు ఇచ్చింది.. వరి, ఇతర పంటలకి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని తెలిపారు.. కాంగ్రెస్ వంద రోజులలో అరు గ్యారంటీలని అటకెక్కించింది.. అరు గ్యారంటీలు అడిగినప్పుడల్లా టాపిక్ డైవర్ట్ చేస్తుందని మండిపడ్డారు.. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.. వరిధాన్యంకి బోనస్ ఇస్తానని సన్నధాన్యంకే బోనస్ ఇస్తుంది.. పద్దెనిమిది నెలల నుంచి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని అన్నారు.


2 లో

**●గోశాలల ఏర్పాటుకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు -కమాండ్ కంట్రోల్ సెంటర్లో సమీక్ష ● వెటర్నరీ, అగ్రికల్చర్ యూనివర్సిటీల భూముల్లో తొలి దశ గోశాలలు ● గోశాలల నిర్వహణకు ధార్మిక సంస్థల భాగస్వామ్యంపై సీఎం ఆలోచన ● విస్తృత భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలి ●ఎంకేపల్లిలో ఏర్పాటవుతున్న గోశాలకు మోడల్ డిజైన్ ఖరారుకు నాలుగు రోజుల్లో ఆఖరి నిర్ణయం - సీఎం రేవంత్ రెడ్డి**

# తెలంగాణలో అత్యాధునిక గోశాలల ఏర్పాటు

రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలను ఏర్పాటు చేయడానికి సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోశాలల ఏర్పాటుకు సంబంధించి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయడమే కాకుండా, నిర్ణీత గడువులోగా నివేదిక రూపొందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో గోశాలల ఏర్పాటు, నిర్వహణ, సంరక్షణ, అభివృద్ధి వంటి అంశాలపై శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన కీలక సూచనలు చేశారు.గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణ కోసం పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలు రూపొందించాలని ఆదేశించారు.

# బాపు మీద


# ఈగ వాలిన సహించేది లేదు


2 లో

**●ఉద్యమకారులపైకి గన్ పట్టుకుని వెళ్లిన వ్యక్తి ఇప్పుడు సీఎం ● జూన్ 4న కేసీఆర్కు నోటీసులపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ● రాజీవ్ యువ వికాసం కాదు -తెలంగాణ యువ వికాసం కావాలి ● తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్సీ కవిత**

## నేటి మాట

అవకాశాలు ఇవ్వబడవు. వాటిని ఉపయోగించుకుని పని చేయాలి. దీనికి పట్టుదల మరియు ధైర్యం అవసరం.



-ఇందిరా గాంధీ

# భారత్ చరిత్రలోనే ఆపరేషన్ సిందూర్

## బిగ్గెస్ట్ సక్సెస్ ఫుల్ ఆపరేషన్ : ప్రధాని మోదీ

**●నారీశక్తి ప్రతాపంతో ఉగ్రవాదుల వినాశనం ● ఆపరేషన్ సిందూర్లో మహిళా అధికారిణుల పాత్ర గర్వకారణం ● రాణి అహల్యాబాయి జయంతి సభలో నారీశక్తిపై మోదీ జోష్ఫుల్ ప్రసంగం**


2 లో

పహల్గాంలో ఉగ్రవాదులు చేసిన దాడి భారత నారీశక్తికి సవాల్గా మారిందని, ఆ సవాల్ వారి వినాశనానికి కారణమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ దాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'లో మహిళా అధికారిణులు పాల్గొని ఉగ్రవాదుల ఆచూకీని గల్లంతు చేశారని ఆయన ప్రశంసించారు. భోపాల్లో రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా జరిగిన 'మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

## జూన్ 10న భారత్ బంద్ -పిలుపునిచ్చిన మావోయిస్టులు


2 లో


2 లో

## మిస్ వరల్డ్ 2025గా మిస్ థాయిలాండ్ ఓపల్ సుచాత

KR TV మన క్రాంతి ఇది వాస్తవ పత్రిక...



# అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే మా అభిమతం : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

ఆటోమోటివ్ రంగంలో కేవలం రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కే పరిమితం కాకుండా తయారీ రంగంలో కూడా తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపేందుకు తమ ప్రభుత్వం తీసుకువచ్చిన పాలసీలు ఉపయోగపడతాయన్నారు.

భారతదేశంలో ఫార్ములా %జు% రేసింగ్ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అన్న కేటీఆర్, పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు రాష్ట్రంలో మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేసిందన్నారు. తమ ప్రభుత్వ నిరంతర కృషితో అంతర్జాతీయ కంపెనీలకు కొత్త చిరునామాగా తెలంగాణ మారిందన్నారు. గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి కార్పోరేట్ దిగ్గజాలు తమ అతిపెద్ద కార్యాలయాలను హైదరాబాద్‌లో ప్రారంభించాయని గుర్తుచేశారు. తమ తొమ్మిదేండ్ల కాలంలో ఐటీ ఉద్యోగాలు, ఎగుమతులతో పాటు ఇతర రంగాల్లోనూ తెలంగాణ అద్భుతంగా పురోగతి సాధించిందన్నారు. ఐటీ, దాని అనుబంధ రంగాలతో పాటు ఆటోమొబైల్ వంటి ఇతర రంగాల్లోనూ మనదేశ యువత తమ ప్రతిభ, నిబద్ధతతో అద్భుతంగా రాణిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత, విద్యార్థులతో పాటు కంపెనీలు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు.

పిడిఎస్ఎల్ డైరెక్టర్ క్రాంతి పుప్పాల మాట్లాడుతూ.. కేటీఆర్ ఆలోచనలు, పనితీరు కేవలం తెలంగాణకు మాత్రమే పరిమితం కాలేదన్నారు. ఆయన చేసిన పనులు, తీసుకొచ్చిన విధానాలు ముఖ్యంగా ఇన్నోవేషన్ రంగానికి చేసిన కృషితో ఐటీ ఒక్కటే కాదు అనేక రంగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా నిలబడిందన్నారు. అనేక దిగ్గజ కంపెనీలను హైదరాబాద్‌కు రప్పించి తన పనితీరు ఆలోచనా ధృక్పథంతో గ్లోబల్ లీడర్‌గా ఎదిగిన కేటీఆర్ చేతుల మీదుగా తమ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించుకోవడం తమ కంపెనీకి అత్యంత గౌరవం అన్నారు క్రాంతి పుప్పాల.

నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం అక్కడ జరిగే కార్యకలాపాలను కేటీఆర్ పరిశీలించారు. తమ సంస్థ గురించి పిడిఎస్ఎల్ ప్రతినిధులు ఆయనకు వివరించారు. ఆ తరువాత కంపెనీ సిబ్బంది,ఉద్యోగులతో కేటీఆర్ ఇంటరాక్ట్ అయ్యారు.

# మోగనున్న పంచాయతీ ఎన్నికల నగారా

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం అన్నిచోట్లా ఇన్‌చార్జ్‌ల పాలన నడుస్తున్నది. ఒక అధికారి ఐదారు పంచాయతీలు, మండలాలు లేదా మున్సిపాలిటీలను పర్యవేక్షిస్తుండటంతో అభివృద్ధి పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా, కాంగ్రెస్ పార్టీ పదేండ్ల తర్వాత అధికారంలోకి రావడంతో గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలు స్థానిక పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

ముఖ్యంగా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ లాంటి పదవులు దక్కితే పార్టీ మరింత బలపడుతుందని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలో.. జూన్ చివరి వారంలో లేదా జులై మొదటి వారం నుంచి స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది.

**పార్టీ పరంగానే 42% రిజర్వేషన్లు**

వాస్తవానికి పంచాయతీ ఎన్నికలను గతేడాదే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. కానీ, అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందుకోసం సమగ్ర కుల గణన సర్వే చేపట్టింది. అనంతరం బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి, ఆమోదించింది.

ఇందుకు సంబంధించిన రెండు బీసీ బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల కేంద్ర కేబినెట్ కూడా దేశవ్యాప్తంగా జన గణనతో పాటు కుల గణన చేసేందుకు అంగీకరించింది. ఇది పూర్తయ్యేందుకు మరో ఏడాదిన్నర సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రం చేసిన కుల గణన వివరాల ఆధారంగా పంపిన స్థానిక బీసీ రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్రపతి ఆమోదిస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఇందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉండడంతోఈసారి పార్టీ పరంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో తప్పని పరిస్థితుల్లో ఇతర పార్టీలు కూడా బీసీలకు అంతే మొత్తంలో రిజర్వేషన్లు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని.. దీంతోనైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు అవుతుందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.

# భారత్ చరిత్రలోనే ఆపరేషన్ సిందూర్ బిగ్గెస్ట్ సక్సెస్ ఫుల్ ఆపరేషన్ : ప్రధాని మోదీ



పహల్గాంలో ఉగ్రవాదులు చేసిన దాడి భారత నారీశక్తికి సవాల్‌గా మారిందని, ఆ సవాల్ వారి వినాశనానికి కారణమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ దాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'లో మహిళా అధికారిణులు పాల్గొని ఉగ్రవాదుల ఆచూకీని గల్లంతు చేశారని ఆయన ప్రశంసించారు. భోపాల్‌లో రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా జరిగిన 'మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఆపరేషన్ ద్వారా ఉగ్రవాదులతోపాటు వారిని ప్రోత్సహించే వారు కూడా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని, భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటిందని మోదీ తెలిపారు. ఆ సమయంలో భారత మహిళల సామర్థ్యాన్ని ప్రపంచం చూసిందని ఆయన వివరించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ దాడుల సమయంలో అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలోని మహిళా బీఎస్ఎఫ్ బృందం అఖ్నూర్‌లోని ఫార్వర్డ్ పోస్టుల వద్ద మూడు రోజులపాటు పోరాడినట్లు ప్రధాని కొనియాడారు.

"మన సంప్రదాయంలో 'సిందూర్' నారీశక్తికి ప్రతీక. పహల్గాంలో ఉగ్రవాదులు మన పౌరుల రక్తం మాత్రమే చూడలేదు, మన సంస్కృతి, సమాజంపై దాడి చేసి విభజించేందుకు ప్రయత్నించారు. కానీ.. భారత నారీశక్తికి విసిరిన సవాల్ వారికి, వారిని సమర్థించే వారికి శాపంగా మారింది. పాకిస్థాన్ సైన్యం ఊహించని ప్రాంతాల్లో మన సాయుధ దళాలు ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేశాయి. ఈ ఆపరేషన్ భారత చరిత్రలో ఒక గొప్ప విజయంగా నిలిచింది." అని ప్రధాని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో ఇండోర్ మెట్రో, దాటియా, సత్నా విమానాశ్రయాల సూపర్ ప్రయారిటీ కారిడార్లను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేశారు. రూ.483 కోట్లతో నిర్మించిన కొత్త అటల్ గ్రామ సేవా సదన్ (పంచాయత్ భవన్)లకు మొదటి విడత నిధులను బదిలీ చేశారు. 18వ శతాబ్దంలో హోల్కర్ రాజవంశానికి చెందిన రాణి అహల్యాబాయి హోల్కర్‌ను స్మరిస్తూ, ఆమె అసాధారణ పాలన, సామాజిక సంక్షేమం పట్ల నిబద్ధతను ప్రశంసించారు. ఈ సందర్భంగా రాణి అహల్యాబాయికి అంకితం చేసిన పోస్టల్ స్టాంప్, రూ.300 స్మారక నాణాన్ని ప్రధాని ఆవిష్కరించారు.

# హైదరాబాద్‌ను కాపాడండి : జలమండలి ఎదుట ఎంపీ ఈటల రాజేందర్ ధర్నా



హైదరాబాద్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అండ్ SNDP పనులు పూర్తి చేయాలని, డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు త్రాగునీరందించాలని డిమాండ్ చేస్తూ ఎంపీ ఈటల రాజేందర్ బీజేపీ కార్పొరేటర్లతో కలిసి జలమండలి కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా నగరంలో అనేక చోట్ల డ్రైనేజీ పనులు పూర్తి కాలేదన్నారు. త్రాగునీరు రావట్లేదని మొరపెట్టుకున్నా సమస్యలు పరిష్కరించకపోగా నిధులు లేవని, పైపులు మీరే తెచ్చుకోవాలని సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని వాపోయారు. ప్రభుత్వం ఇలాగే మొద్దు నిద్రపోతే సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ ఉద్యమం చేస్తామన్నారు. SNDP ప్రాజెక్టును సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. టెక్నాలజీ ఉన్నప్పుడు ఉన్న నగరాన్ని బాగు చేయాలని, నగరం మునిగిపోకుండా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. గతంలో కేసీఆర్ కూడా ఈ విషయంపై ప్రగల్భాలు పలికారన్నారు. ఉన్న పైపులైన్లకే మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రభుత్వం సిబ్బందిని పెంచి వర్షాల సమయంలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వచ్చే వర్షాకాలం నాటికి ఈ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ వంద రోజులలో ఆరు గ్యారంటీలని అటకెక్కించింది..

మొదటి పేజీ తరువాయి

ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోలు, కాళేశ్వరం, ఫార్ములా కేసు, డ్రగ్స్ ల కేసులు పత్తా లేకుండా పొయాయి.. మూటలు తీసుకెళ్ళి ఢిల్లీకి కప్పం కడుతున్నారని తెలిపారు.. రాజన్న కోడెల మరణాల విషయంపై మాట్లాడుతూ.. కోడెలని రక్షించాల్సిన బాధ్యత రాజన్న దేవస్థానందే.. కోడెలని రక్షించడానికి సరైనా ప్రణాళికలు రూపోందించాలి.. కోడెలు ఉంచే గదుల సంఖ్యలని పెంచాలని సూచించారు.. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు భారత సైనికులని కించపరిచే విధంగా ఉంది.. అర్మీ ఛీఫ్ మీద మీకు విశ్వాసం లేదా అని ప్రశ్నించారు.. పహల్గాం సంఘటన జరిగిన పదిహేను రోజులలోనే ఉగ్రవాదులని చంపాం.. ఉగ్రవాదం అంతమయ్యే వరకు యుద్ధం కొనసాగుతుంది.. అపరేషన్ సింధూర్ కొనసాగుతుంది.. పీవోకే ని కాంగ్రెస్ ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు.

కవిత లెటర్ పై చర్చ కాంగ్రెస్ డ్రామా.. బీఅర్ఎస్, బిజేపి పార్టీలో కలవదు.. కవిత అరెస్టుని అపడానికి బిజేపి తో కలవాలని చూసినప్పుడే దగ్గరికి రానివ్వలేదు.. కాంగ్రెస్ డైరెక్షన్ లో జరిగినదే కవిత లేఖ.. బీఅర్ఎస్ అవినీతి పార్టీ.. కుటుంబ పార్టీ మేము దగ్గరికి రానివ్వము.. కాంగ్రెస్, బిఅర్ఎస్ అడ్డుకున్నా బిజేపి ప్రస్థానం అగదు.. అందరికి అధికారం ఇచ్చాం.. బిజేపికి అవకాశం ఇద్దాం, అధికారం ఇద్దామన్న ఆలోచనలో తెలంగాణ సమాజం ఉంది.. కల్వకుంట్ల అర్ట్ ప్రోడక్షన్ లో తెలంగాణ చార్ పత్తా సినిమా నడుస్తుంది.. కవిత, కేటిఆర్, సంతోష్ , హరిష్ రావులు చార్ పత్తా అయితే కెసిఅర్ జోకర్ అని ఎద్దేవా చేశారు.

# మా పార్టీ నుంచి వెళ్లిన నేతలను వ్యక్తిగతంగా ఎప్పుడూ కలవలేదు: హరీశ్‌రావు



పీసీసీ అధ్యక్ష హోదాలో ఉంటూ మహేశ్‌కుమార్‌గౌడ్ చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. భాజపా ఎంపీ ఈటల రాజేందర్‌తో భారాస నేతలు రహస్యంగా సమావేశమయ్యారంటూ మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు.

"బట్ట కాల్చి మీద వేసినంత మాత్రాన అబద్ధాలు నిజం కావు. మా పార్టీ నుంచి వెళ్లిన నేతలను వ్యక్తిగతంగా ఎప్పుడూ కలవలేదు. పెళ్లిలోనో, చావులోనో కలిసిన సందర్భాలే తప్ప వ్యక్తిగతంగా కలవలేదు. మీరు విలువలు విస్మరించి రేవంత్‌రెడ్డి బాటలోనే నడుస్తున్నారు. ఇలాంటి ఆరోపణలు మానుకొని స్థాయికి తగ్గట్లు వ్యవహరించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, హామీల అమలుపై దృష్టిపెట్టాలి" అని హరీశ్‌రావు తెలిపారు.

# తెలంగాణలో అత్యాధునిక గోశాలల ఏర్పాటు: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

గోసంరక్షణ, వాటి నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు జరగాలని చెప్పారు. మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. గోశాలల ఏర్పాటు కోసం అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని, కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

బంధించినట్టుగా ఇరుకు స్థలాల్లో కాకుండా మేతకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా గోశాలలు ఉండాలన్నారు. గోశాలల నిర్వహణ, సంరక్షణ విషయంలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను సీఎం పరిశీలించి పలు మార్పులు సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్‌ను ఖరారు చేయాలని ఆదేశించారు.

# వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి



వెనుకబడిన వర్గాలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షమ పథకాలను రూపొందిస్తోందన్నారు.

వెనుకబడిన వర్గాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం భూ గరిష్ట పరిమితి చట్టం చేసిందని, భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు భూములు పంపిణీ చేసింది కాంగ్రెస్ప్ర భుత్వం మాత్రమే అని భట్టి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో 6.70 లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేస్తే ఆ భూములను దున్నుకోకుండా అడ్డుకోవడమే కాకుండా మహిళలని చూడకుండా చెట్టుకు కట్టేసి బీఆర్ఎస్ దాష్టికాలకు పాల్పడిందని విమర్శించారు. గిరిజనుల కోసం ఇటీవలే ఇందిరాగాంధీ సౌర గిరిజల పథకాన్ని ప్రారంభించామన్నారు. ఈ పథకానికి రూ. 12,500 కోట్లు కేటాయించామన్నారు. 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని ఈ సబ్ ప్లాన్ కు రూ. 17,169 కోట్లు కేటాయిస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు గాలికి వదిలేసిందన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఇవ్వలేదని ఉన్న నిధులు కూడా ఖర్చు చేయలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ చేపట్టిన పథకాలను కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. దళితులు, గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో హస్తగతం చేసుకున్నారన్నారు. చెప్పినట్లుగా తాము అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేసి భూభారతి తీసుకువచ్చామన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్ పై గత పదేళ్లు బీఆర్ఎస్ ఆలోచన చేయలేదు. కానీ మేము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేడెట్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను పక్కా భవనాలతో నిర్మించే కార్యక్రమం చేపట్టామన్నారు.

# జూన్ 10న భారత్ బంద్ - పిలుపునిచ్చిన మావోయిస్టులు

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' చేపడుతోన్న విషయం తెలిసిందే. ఇటీవల తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మొత్తం 27 మంది మావోయిస్టులను ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనే కీలక నేత నంబాల కేశవరావు, దళ సభ్యుల మృతికి నిరసనగా జూన్ 10న భారత్ బంద్‌కు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. అదేవిధంగా జూన్ 11 నుంచి ఆగస్టు 3 వరకు అమర వీరుల స్మారక సభలను నిర్వహించనున్నట్లుగా వెల్లడించారు. 2024 నుంచి ఇప్పటి వరకు 540 మంది మావోయిస్టులు భద్రతా దళాలు జరిపిన ఎదురుకాల్పుల్లో మృతి చెందారని వారు పేర్కొన్నారు. తాము శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా.. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ఆపడం లేదని అన్నారు. గత రెండు నెలలుగా సంయమనం పాటించామని.. కేంద్ర రాష్ట్ర ఫాసిస్ట్ వైఖరికి నిరసనగా జూన్ 10న భారత్ బంద్‌కు పిలుపునిస్తున్నామని మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఇవాళ లేఖను విడుదల చేశారు.

మే 21 భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటి రోజన లేఖలో ప్రస్తావించారు. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టులు, రక్తపిపాసులు, దేవ నరహంతకులైన ప్రధాని, కేంద్ర హోంమంత్రి మావోయిస్టులపై ప్రత్యక్ష యుద్ధం ప్రకటించారని ఆరోపించారు. భారత సైన్యం, పారా మిలటరీ, కమాండో బలగాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు నారాయణపూర్ మాడ్ ప్రాంతంలో చేపట్టిన జాయింట్ ఆపరేషన్‌లో మావోయిస్టు కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో సమా పీఎల్‌జీఏకు చెందిన వివిధ స్థాయి నాయకత్వ కామేడ్లను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారని ఆరోపించారు. ఈ హత్యాకాండను కొనసాగించిన భద్రతా దళాలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్లజ్జగా చారిత్రాత్మక విజయమంటూ ప్రకటించుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ హత్యాకాండకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జూన్ 10న భారత్ బంద్ పాటించాలని దేశ ప్రజానికానికి పిలుపునిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా జూన్ 11 నుంచి ఆగస్టు 3 వరకు దేశ వ్యాప్తంగా కామ్రేడ్ బసవరాజ్ సహా 27 మంది అమరవీరుల స్మారక సభలు జరపాల్సిందిగా పిలుపునిస్తున్నామని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ లేఖలో వెల్లడించింది.

# బాపు మీద ఈగ వాలిన సహించేది లేదు - ఎమ్మెల్సీ కవిత

తెలంగాణ జాగృతి కార్యాలయాన్ని హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో శనివారం ఎమ్మెల్సీ కవిత ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. 'కేసీఆర్ మీద ఈగ వాలనియ్యం' అని ప్రకటించారు. జాగృతి చేస్తున్న కార్యక్రమాలకు కొంతమంది ఆగమవుతున్నారని తెలిపారు. కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులకు నిరసనగా ఈనెల 4వ తేదీన ధర్నా చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కవిత వెల్లడించారు. ఈ ధర్నాకు అందరినీ స్వాగతం పలుకుతున్నట్లు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

'తెలంగాణ సోయితో కేసీఆర్ పరిపాలన చేశారు. మన కర్మ ఇప్పుడు ఉన్న సీఎం జై తెలంగాణ అనరు. జూన్ 2వ తేదీన సీఎం జై తెలంగాణ అనాలి. అమరవీరులకు నివాళులర్పించాలి' అని రేవంత్ రెడ్డిని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. 'రాజీవ్ యువ వికాసం పేరుతో కార్యక్రమం ఉండొద్దు. రాజీవ్ గాంధీ తెలంగాణకు ఏం సంబంధం' అని కవిత ప్రశ్నించారు. ఆ పథకానికి తెలంగాణ కోసం అమరులైన శ్రీకాంతాచారి, యాదిరెడ్డి లాంటి వారి పేరు పెట్టాలి' అని విజ్ఞప్తి చేశారు.

గోదావరి కావేరీ అనుసంధానం పేరుతో గోదావరి నీరు తెలంగాణకు దూరం కాబోతున్నాయని ఎమ్మెల్సీ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. '200 టీఎంసీ నీళ్ల హక్కు కోసం రేవంత్ రెడ్డి నోరు మెదపరు. నీళ్ల హక్కుల కోసం పోరాటం చేయాలి' అని డిమాండ్ చేశారు. 'తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు ఎందుకు నోటీసులు ఇచ్చారు' అని నిలదీశారు. 'అది కాళేశ్వరం కమిషన్ లేక కాంగ్రెస్ కమిషన్ హ?' అని సందేహం వ్యక్తం చేశారు.

కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడానికి వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద జూన్ 4వ తేదీన మహా ధర్నా చేపడుతున్నట్లు ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. కాంగ్రెస్ కాళేశ్వరంపై కుట్రలను ఎండగడుతున్నామని.. బీజేపీ బీసీ బిల్లును డీ ఫ్రీజ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే జాగృతి తరపున మళ్లీ పోరాటం చేస్తామని తెలిపారు. 'విద్యార్థులు, మహిళల కోసం, మైనార్టీల కోసం ఇచిన హామీల అమలు కోసం పోరాటం చేస్తాం' అని ప్రకటన చేశారు. 'గోదావరి నీళ్లు తరలించే కుట్ర జరుగుతుంది. కుట్రలో కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం భాగమే. గోదావరి నీళ్లు తరలించుకుపోతే రేవంత్ రెడ్డి, బీజేపీ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదు' అని కవిత ప్రశ్నించారు.


# కాంగ్రెస్ నేతలను దేశ ద్రోహులన్నారు.. మంత్రి ఉత్తమ్ ఘాటు వ్యాఖ్యలు



'ఆపరేషన్ సిందూర్' లో భాగంగా ఎన్ని ఎయిర్‌క్రాఫ్ట్ కూలిపోయాయని ప్రశ్నించగా.. విదేశాంగ శాఖ ఇప్పటి వరకు సరైన సమాధానం చెప్పలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌తో భారత అద్భుత విజయం సాధించిందని వారికి అభినందనలు తెలిపారు. పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్ లో ఉగ్రవాదుల స్థావరాలపై ఖచ్చితమైన దాడులు జరిగాయని అన్నారు.

యుద్ధంలో రాఫెల్ ఎయిర్‌క్రాఫ్ట్ కూలిపోయిందా అని అడినందుకు కాంగ్రెస్ నేతలను దేశ ద్రోహులంటూ విమర్శించారని ఫైర్ అయ్యారు. అయితే, సీడీఎస్ అనిల్ చౌహాన్ రాఫెల్ కూలిపోయింది నిజమేనని వెల్లడించారని.. ఇప్పుడు అయన కూడా దేశద్రోహేనా.. అని ప్రశ్నించారు. ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్ ఉత్పత్తిలో ఆలస్యం జరుగుతోందంటూ ఎయిర్ మార్షల్ చెప్పారని.. ఇదే విషయమై రాహుల్ గాంధీ తాను పార్లమెంట్ లో మాట్లాడామని అన్నారు. ఇన్‌టైమ్‌లో ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్ డెలివరీ చేయడంలో హాల్ ఫెయిలైందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇన్‌టైంలో ప్రొడక్షన్ పూర్యేలా చర్చలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాస్తవానికి ఏడాదికి హాల్ 24 ఎయిర్ క్రాఫ్ట్‌లు ఉత్పత్తి చేయాలని అది సాధ్యపడటం లేదన్నారు. మేధావులంతా రక్షణ రంగంలో రావాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

# మిస్ వరల్డ్ 2025గా మిస్ థాయిలాండ్ ఓపల్ సుచాత




ఉత్కంఠగా సాగిన 72వ మిస్ వరల్డ్ పోటీల్లో థాయిలాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ ప్రపంచ సుందరి కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా 72వ ప్రపంచ సుందరికి కిరీటాన్ని సుచాతా చువాంగ్‌కు ధరించారు. 3వ రన్నర్ అప్ గా మిస్ మార్టినిక్, 2వ రన్నర్ అప్‌గా మిస్ పోలెండ్, 1వ రన్నర్ అప్‌గా ఇథియోపియా నిలిచారు. మిస్ వరల్డ్‌గా ఎంపికైన సుచాతకు.. రూ.8.5 కోట్ల ప్రైజ్ మనీ అందనుంది. సుచాత.. థాయ్‌లాండ్‌లోని పుకెట్‌లో జన్మించారు. మొత్తం 108 దేశాలకు చెందిన కంటెస్టెంట్‌లు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

## సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులుకు వైద్య పరీక్షలు పూర్తి



విజయవాడ ,31 మే (క్రాంతి న్యూస్ ): ఏపీపీఎస్సీ అక్రమాల కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. బీపీలో హెచ్చు తగ్గులు ఉండటంతో పీఎస్సార్‌ను విజయవాడ జైలు నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఆయనకు అవసరమైన వైద్య పరీక్షలు చేశారు. ఆంజనేయులుకు గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ ఆసుపత్రి గుండె వైద్య వార్డులో ఆయనను ఉంచారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు వైద్యులు పర్యవేక్షించారు.

రేపు యాంజియో చేయడానికి వైద్యులు ఏర్పాట్లు చేశారు. అయితే, తాను ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండనంటూ ఆయన మరోసారి వాగ్వివాదానికి దిగారు. రాత్రి అక్కడే పర్యవేక్షణలో ఉండాలని వైద్యులు కోరినా వినలేదు. సోమవారం వస్తానని వార్డు నుంచి బయటకు వచ్చేశారు. ఎంత చెప్పినా పీఎస్సార్ ఆంజనేయులు వినకపోవటంతో అధికారులు ఆయనను జిల్లా జైలుకు తరలించారు.

కాగా.. ముంబై నటి కాదంబరి జత్వానీని అక్రమంగా నిర్బంధించి కేసు పెట్టారంటూ గతంలో పీఎస్సాఆర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న సమయంలోనే ఏపీపీఎస్సీలో అనేక అవకతవలకు పాల్పడ్డారంటూ అభియోగాలు నమోదు అయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఏపీపీఎస్సీ అక్రమాల కేసులో ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# ఆర్ నారాయణమూర్తి వెనుక ఉన్నది ఎవరో బయట పెడతా: నట్టి కుమార్

అమరావతి ,31 మే (క్రాంతి న్యూస్ ): థియేటర్ల బంద్, పర్సంటేజీల వ్యవహారంపై ప్రముఖ నటులు ఆర్. నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లను ఉద్దేశించి నారాయణమూర్తి చేసిన కామెంట్స్‌పై ప్రముఖ నిర్మాత, దర్శకులు నట్టి కుమార్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఆర్ నారాయణమూర్తి వెనుక ఉన్నది ఎవరో బయట పెడతానని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో నట్టికుమార్ మీడియాతో మాట్లాడారు. ఆర్. నారాయణమూర్తి పవన్ కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లను తప్పుపట్టారని మండిపడ్డారు. గతంలో సినీప్రముఖులు.. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డితో జరిగిన సమావేశానికి నారాయణమూర్తి కూడా వెళ్లారని గుర్తుచేశారు. అప్పుడు మెగాస్టార్ చిరంజీవిని, మిగతా పెద్దలను అవమానించినప్పుడు నారాయణమూర్తి ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. చిన్న సినిమాకు ఐదో షో ఇప్పించలేనప్పుడు.. జగన్, కేసీఆర్ హయాంలో వారికి దగ్గరగా ఉన్నప్పుడు నారాయణమూర్తి ఎందుకు స్పందించలేదని నిలదీశారు నట్టి కుమార్.

జగన్ చిన్న సినిమాలకు ఏం చేశారు.

'రాజకీయాలు మాట్లాడాలంటే మాట్లాడవచ్చు. థియేటర్ల బంద్ బ్రహ్మాస్త్రం అన్నారు మంచిది. ఫుడ్ రేట్లు ఎక్కువగా ఉంటే ఎందుకు అడగలేదు. జగన్ చిన్న సినిమాలకు ఏం చేశారు.. ఎందుకు మాట్లాడలేదు. మీరు గుత్తాధిపత్యానికి ఆధ్యం పోస్తున్నారు. మీ భావాలు మారాయి. కార్పొరేట్ కంపెనీలకు మద్దతు పలుకుతున్నారు. మీతో ఎవరు మాట్లాడిస్తున్నారో నాకు తెలుసు. ఆర్. నారాయణమూర్తి, పోసాని కృష్ణమురళి చిన్న సినిమాలకు ఏం చేశారు. సినీ ఇండస్ట్రీకి ఏం చేశారు. చిన్న సినిమాలకు ఐదో షో ఏది.. ఫుడ్ రేట్లు తగ్గాయా.. చిరంజీవిని దగ్గరుండి అవమానపరిచారు. పవన్‌కల్యాణ్ మాటలే మీకు ప్రాబ్లమా..సమస్యలను తీర్చాల్సింది ఛాంబర్, కౌన్సిల్.. అది కూడా మీకు తెలీదా.. ఎందుకు కావాలని పవన్‌కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లని టార్గెట్ చేశారు. జగన్ ఆ రోజు రూ. 5, రూ 35లకు టికెట్ అమ్మితే ఏం చేశారు' అని నట్టి కుమార్ ప్రశ్నల వర్షం కురిపించారు.

ఆ నలుగురి వల్లే న్యాయం జరగట్లేదు...

'ఇంకొక నిర్మాత జనసేన నాయకుడు అంటూ ఓ ఎగ్జిబిటర్ గురించి కామెంట్స్ చేశారు. కావాలనే జనసేన పార్టీ పేరును ఈ విషయంలోకి తెస్తున్నారు. ఆ నలుగురి వల్లే ఎవరికీ న్యాయం జరగట్లేదు.. ఈ



రోజుకు ఐదో షో రాలేదు. తెలంగాణలో భారీ రేట్లకు ఫుడ్ అమ్ముతుంటే ఎందుకు ప్రశ్నించటం లేదు... కానీ నారాయణమూర్తి పవన్‌కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లని విమర్శిస్తున్నారు. ఏ ఛానెల్ అయితే మీకు లైవ్ ఇచ్చిందో, ఏ నాయకుడు మీ వెనుక ఉన్నారో వాళ్లకు చెపుతున్నా... గత ఐదేళ్లు మీరు ఇండస్ట్రీని ఇబ్బంది పెట్టారు.. ఆ రోజు మీరు వాళ్లను ఎందుకు అడగలేదు నారాయణమూర్తి. గుత్తాధిపత్యాన్ని అరికట్టాలనటం పవన్‌కల్యాణ్ తప్పా. జగన్ ఎక్కడ న్యాయం చేశారో చెప్పాలి. నిజమైన ఎగ్జిబిటర్‌కు నష్టం జరుగుతుంటే ఎందుకు మాట్లాడరు.. పని కట్టుకుని కూటమి ప్రభుత్వాన్ని, పవన్‌కల్యాణ్‌లని విమర్శిస్తున్నారు. ఆ రోజు, ఈ రోజు చిన్న సినిమాలకు సపోర్ట్‌గా మాట్లాడింది నేనే' అని నట్టి కుమార్ పేర్కొన్నారు.

# జగన్ హయాంలో విద్యా సంస్కరణలను దెబ్బతీశారు

అమరావతి ,31 మే (క్రాంతి న్యూస్ ):ప్రజా జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ఫెయిల్ అయిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి నారా లోకేష్ హితవు పలికారు. చిన్నప్పుడే టెన్త్ పేపర్లు ఎత్తుకుపోయిన జగన్ నుంచి హుందాతనం ఆశించడం తప్పేనని అన్నారు. శనివారం మంత్రి నారా లోకేష్ సచివాలయంలో తన ఛాంబర్ నుంచి మీడియాతో మాట్లాడారు. యూనిఫామ్ దగ్గర నుంచి చిక్కీ వరకూ పార్టీ రంగులు, జగన్ పేరు పెట్టుకొని ఇప్పుడు విలువలు గురించి మాట్లాడటం ఆయనకే చెల్లిందని విమర్శించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఉచితంగా ఇచ్చే టెక్ట్స్‌బుక్స్ రద్దు చేసిన మీరు మాట్లాడటమేనా అని ప్రశ్నించారు మంత్రి నారా లోకేష్.



అధికారంలో ఉన్నప్పుడు ఉపాధ్యాయులను మద్యం షాపుల ముందు కాపలా పెట్టిన మీరు ఇప్పటికీ వారి పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మంత్రి నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఓ117, ఇతర అసంబద్ధ నిర్ణయాలతో వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 12 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్ల బాట పట్టారని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను సిద్ధం చేయకుండానే వెయ్యి పాఠశాలల్లో సీబీఎస్ఈ పరీక్షా విధానాన్ని జగన్ తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. తాను మంత్రి అయిన వెంటనే నిర్వహించిన టెస్ట్‌లో 90శాతం మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని తెలిపారు. పదోతరగతి ఫెయిల్ అయితే చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని, ముఖ్యంగా ఆడపిల్లలు అయితే చదువు ఆపించి పెళ్లి చేస్తారని చెప్పారు మంత్రి నారా లోకేష్.

వారి భవిష్యత్తు కోసం ఆలోచించే సీబీఎస్ఈ పరీక్షా విధానాన్ని తాము వాయిదా వేశామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయులను, విద్యార్థులను సిద్ధం చేసిన తర్వాతే సీబీఎస్ఈ పరీక్షా విధానాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నామని వివరించారు. జగన్ భ్రష్టు పట్టించిన విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని చెప్పారు. టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ ద్వారా రాజకీయాలకు అతీతంగా ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకూ పాఠ్య ప్రణాళిక మారుస్తున్నామని స్పష్టం చేశారు. పదోతరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో తమకు అన్యాయం జరిగిందని విద్యార్థులు భావించినప్పుడు రీ కౌంటింగ్/రీ వెరిఫికేషన్ కోరడం ఎప్పటినుంచో జరుగుతున్న ప్రక్రియ అని వివరించారు. ఈ ఏడాది 45,96,527 లక్షల విద్యార్థుల జవాబు పత్రాలను మూల్యాంకనం చేశామని ప్రకటించారు మంత్రి నారా లోకేష్.

రీ కౌంటింగ్/ రీ వెరిఫికేషన్ తర్వాత మార్కుల్లో వ్యత్యాసం వచ్చిన జవాబు పత్రాల సంఖ్య 11,175 అని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. 99.75 శాతం ఖచ్చితత్వంతో మూల్యాంకనం జరిగిందని తెలిపారు. మానవ తప్పిదం 0.25 శాతం మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఏడాది కూడా 34,709 మంది విద్యార్థులు 66,363 స్క్రిప్టుల రీ కౌంటింగ్/ రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. జగన్ జమానాలో 2022లో 41,694 స్క్రిప్టుల రీ కౌంటింగ్/ రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని.. అందులో 8,235 స్క్రిప్టుల (20 శాతం) వ్యత్యాసాలను గుర్తించారని అన్నారు. జగన్ హయాంలో కనీసం ఈ వివరాలను బయట పెట్టే ధైర్యం కూడా చేయలేదని మండిపడ్డారు. ఈ వాస్తవాలను మరుగున పెట్టి తమపై బురద జల్లడం సిగ్గుచేటని మంత్రి నారా లోకేష్ విమర్శించారు.

## నేను నారా లోకేష్‌పై గెలిచాను.. అందుకే ఈ తప్పుడు కేసులు..!



గుంటూరు ,31 మే (క్రాంతి న్యూస్ ):వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి గుంటూరు సీఐడీ కార్యాలయానికి వెళ్లారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి అంశంలో సీఐడీ విచారణకి ఆయన హాజరయ్యారు. తాజాగా వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సీఐడీ విచారణ ముగిసింది.. రెండు గంటలపాటు సీఐడీ అధికారులు ఆర్కేను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో తనకు నోటీసు ఇచ్చారని తెలిపారు. నోటీసు ఇవ్వడంతో తాను విచారణకు హాజరయ్యానని చెప్పారు. తాను ఆ రోజు లేనని.. దాడి జరిగిన అంశం నాకు తెలియదని అని విచారణలో చెప్పానన్నారు.

"నాకు నోటీస్ ఇవ్వడమే దారుణం. 2021లో జరిగిన అంశంపై పోలీసులు విచారణ చేశారు. అదే దర్యాప్తులో కొత్తగా నోటీసులు ఇవ్వడం దారుణం. నారా లోకేష్ పై నేను గెలిచాను కాబట్టే తప్పుడు కేసులు పెడుతున్నట్లు అనిపిస్తుంది. రాజకీయ కక్ష్యతోనే నన్ను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. అనేక కేసుల్లో నన్ను ఇరికించాలని చూశారు ఎక్కడ ఏది కనిపించలేదు. నేను కేసులో ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవు. ఎవరు నా పేరుని చెప్పి కూడా ఉండరు. సీసీటీవీ ఫుటేజ్ లో ఎక్కడ నేను లేను. ఛార్జ్ షీట్ వేసే ముందు కావాలని నా పేరుని ఈ కేసులో చేర్చారు." అని మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు.

## నేటి నుంచి రేషన్ షాపుల రీ ఓపెన్.. మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం..



అమరావతి ,31 మే (క్రాంతి న్యూస్ ):చౌక ధరల దుకాణాలు మళ్ళీ తెరుచుకుంటున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. జూన్ 1 నుంచి 29,760 చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకులు అందించబోతున్నామని స్పష్టం చేశారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు% % తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు చౌక ధరల దుకాణాలలో సరుకులు అందిస్తామని పేర్కొన్నారు. "మీకు వీలైన సమయంలో వెళ్ళి తెచ్చుకోవచ్చు.. రేపటి నుంచి 1 కోటి 46 లక్షల కుటుంబాలకి నిత్యావసర వస్తువులు నిరాటంకంగా అందేలా చూస్తాం. ప్రతీ నెలా దాదాపు 16 లక్షల మంది దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకి ఇంటికే రేషన్ సరుకులు అందించే ఏర్పాటు చేశాం. కూటమి ప్రభుత్వం ప్రజల మేలు కోరే ప్రభుత్వం." అని నాదెండ్ల మనోహర్ పోస్టులో రాసుకొచ్చారు.

కాగా.. ప్రతీ పేద కుటుంబానికి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరకులు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. "పేదలకు రేషన్ సరకులు అందించే చౌకధరల దుకాణాలను గత ప్రభుత్వం మూసివేసింది. ఇంటింటికీ అందిస్తామని రూ.1600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేశారు. ఇంటింటికీ ఇవ్వడం మానేసి నెలలో ఒకటి రెండ్రోజులు మాత్రమే జంక్షన్లలో వాహనం నిలిపి ఇవ్వడంతో ఎంతో మంది పేదలు సరకులు అందక ఇబ్బందులు పడ్డారు. ఆ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకొని, చిరుద్యోగాలకు సెలవులు పెట్టుకోవాల్సి వచ్చేది. మిగిలిన రేషన్ బియ్యం, సరకులను అక్రమంగా తరలిస్తున్న విషయం సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపింది. వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని కాకినాడ, విశాఖ పోర్టుల్లో పట్టుకుంది. వీటిని అరికట్టేందుకు చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు నిత్యావసరాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దివ్యాంగులు, 65 ఏళు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరకులు అందించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హత గల ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు

## - మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)



మంచిర్యాల,31 మే (క్రాంతి న్యూస్ ): ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఫలాలు అర్హత గల ప్రతి ఒక్కరికి అందేలా అధికార యంత్రాంగం సమిష్టిగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, రాజర్షి షా, అభిలాష అభినవ్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, శాసనమండలి సభ్యులు మల్క కొమురయ్య, దండే విఠల్, మంచిర్యాల, బెల్లంపల్లి, ముథోల్ నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, రామారావు పటేల్, జి.సి.సి. చైర్మన్ కొట్నాక తిరుపతి లతో కలిసి ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, రెవెన్యూ, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖల అధికారులతో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, యాసంగి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ సాగు సన్నద్ధం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. యాసంగి వరి ధాన్యం సేకరణ కొరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం సేకరించడం జరుగుతుందని, ధాన్యం సేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుతుందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూభారతి నూతన ఆర్. ఓ. ఆర్. చట్టం- 2025లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేసి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత సమస్యలను జూన్ 2వ తేదీలోగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. 2వ విడతలో జిల్లాకు ఒక మండలం చొప్పున ఎంపిక చేసి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. జూన్ 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు అన్ని మండలాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూ భారతి చట్టం. రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. రైతులు తమ భూములను స్వేచ్ఛగా సాగు చేసుకునేలా ఎలాంటి వివాదాలు లేకుండా భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. అత్యంత పేదవారికి జాబితాలో చోటు కల్పించడం జరుగుతుందని, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పి.వి.టి.జి.లు, ఇతర ఆదివాసీలకు 5 వేల ఇందిరమ్మ ఇండ్లు ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఖరీఫ్-2025 సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం కావాలని, నైరుతి రుతుపవనాలు వస్తున్నందున విత్తనాలు, ఎరువులు అవసరమైన మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అధిక ధరలకు విక్రయిస్తూ, కృత్రిమ కొరత సృష్టించే వారిపై, నకిలీ / నిషేధిత విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రకృతి వైపరీత్య నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని, నీటిపారుదల, వైద్య-ఆరోగ్య, వ్యవసాయ శాఖలు, సంబంధిత శాఖలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని చేపట్టిన కార్యక్రమాలపై కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న దృష్ట్యా పాఠశాలలు, వసతిగృహాలు సిద్ధం చేయాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి కౌమార దశ పిల్లల కొరకు పౌష్టికాహారం కొరకు చిక్కీలను ఇవ్వడం జరుగుతుందని, అంగన్వాడీ టీచర్లకు 2 లక్షల రూపాయల రిటైర్మెంట్ బెన్ఫిట్స్, వేసవి సెలవులు ఇవ్వడం జరుగుతుందని, జీతాల పెంపుదల అంశంపై ప్రభుత్వం ఆలోచిస్తుందని, 35 వేల 700 అంగన్వాడీ కేంద్రాలను ప్రి-ప్రైమరీ పాఠశాలలుగా మార్చడం జరిగిందని, 50 రకాల ఆట వస్తువులు అందించడం జరిగిందని, టీచర్లు, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించి దేశంలోనే రాష్ట్రం ముందంజలో ఉండేలా కృషి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఏప్రిల్ 14వ తేదీన ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం-2025లో భాగంగా పైలెట్ మండలంగా జిల్లాలోని భీమారం మండలం ఎంపిక చేయడం జరిగిందని, ఈ క్రమంలో భీమారం మండలంలోని 12 గ్రామపంచాయతీలలో 28 మంది సిబ్బందితో 4 బృందాలను నియమించి భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఒక ప్రత్యేక సర్వే బృందంతో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 2 వేల 148 దరఖాస్తులు రాగా 1 వేయి 10 సాదాబైనామాపై అందాయని, న్యాయస్థానంలో కేసులు కొనసాగుతున్నందున తీర్పు అనంతరం పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. మిగిలిన 1 వేయి 138 దరఖాస్తులలో 741 ఇప్పటి వరకు పరిష్కరించడం జరిగిందని, మిగిలిన వాటిని జూన్ 5వ తేదీ లోగా పరిష్కరిస్తామని తెలిపారు. మిగిలిన మండలాలలో జూన్ 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు మండలానికి 2 బృందాల చొప్పున ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో 2 వేల ఇండ్లు మంజూరు కాగా 991 ఇండ్లు గ్రౌండ్ ప్రక్రియ పూర్తయ్యాయని, నిర్మాణ దశను బట్టి బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం ఈ సమయానికి 1 లక్షా 35 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేయగా ఈసారి 1 లక్షా 77 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని. తెలిపారు. గతంలో పోల్చితే ఈసారి 1.5, 2 రెట్లు అధికంగా కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి జిల్లాలో నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువుల రవాణా, విక్రయంపై చర్యలు చేపట్టామని, ఇప్పటి వరకు 34 మందిని అరెస్టు కాగా 871 కిలోల నకిలీ, నిషేధిత విత్తనాలను స్వాధీనపర్చుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లా సరిహద్దులో అంతర్గత చెకోపోస్టులను ఏర్పాటు చేసి విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు, అనంతరం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కిశోర బాలికల కొరకు ఇందిరమ్మ అమృతం పథకం క్రింద పల్లీలు, చిరుధాన్యాలతో తయారుచేసిన చిక్కీల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా అటవీ అధికారి శివ్ అశిష్ సింగ్, పంచాయతీరాజ్, గృహనిర్మాణ, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 3 నుంచి అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

**జూన్ 03 వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు**

**ఉదయం 09.00 గంటల నుంచి సాయంత్రం 05.00 గంటల దాకా నిర్వహణ**

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలతో సమీక్ష సమావేశం**



సిరిసిల్ల,31 మే (క్రాంతి న్యూస్ ): వచ్చేనెల జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. వచ్చేనెల మూడో తేదీ నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులపై జిల్లాలోని ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణ, అప్లికేషన్లు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో నిర్వహించే సదస్సులపై రెండు రోజుల ముందుగా ఆయా గ్రామాలకు సమాచారం ఇవ్వాలని, అప్లికేషన్ తో పాటు ఇవ్వాల్సిన పత్రాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సదస్సులు నిర్వహించాలని తెలిపారు. సదస్సులు నిర్వహించే చోట హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని, అప్లికేషన్ ఫారాలు ఇతర కావాల్సిన సామగ్రిని అందుబాటులో ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అప్లికేషన్ పూర్తిగా పక్కా సమాచారంతో నింపాలని తెలిపారు. ఆ వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షించాలని స్పష్టం చేశారు. భూములకు సంబంధించి వచ్చే అప్లికేషన్ వివరాలు ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసి దానిలో నమోదు చేయాలని పేర్కొన్నారు. అప్లికేషన్ లు ప్రతి అంశం చక్కగా రాయాలని అప్లికేషన్ స్వీకరించిన తర్వాత దరఖాస్తుదారులకు రిసీవ్డ్ కాపీ అందజేయాలని, వారి కోసం ప్రత్యేకంగా సిబ్బంది నియమించి రాయించాలని సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేసే సదస్సులను విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో రెండు టీములు ఏర్పాటు చేయాలని ఒక టీముకు తహసిల్దార్, మరొక టీంకు డిప్యూటీ తాసిల్దార్ నేతృత్వం వహించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు సదస్సులకు వచ్చే ముందు తమ భూమికి సంబంధించిన పత్రాలను వెంట తీసుకెళ్లాలని కలెక్టర్ చూపించారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ శాఖకే వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి ఉదయ్ కుమార్ రెడ్డి

### ఐజి. చంద్రశేఖర్ రెడ్డి



మెదక్ ప్రతినిధి,31 మే (క్రాంతి న్యూస్ ): శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా ఎస్పీ సేవలు అమోఘమని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. జిల్లా ఎస్పీ పదవీ విరమణ సమావేశం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ నిర్వహించారు .ఈ కార్యక్రమానికి తెలంగాణ ఐ జి చంద్రశేఖర్ రెడ్డి జిల్లా న్యాయమూర్తి నీలిమ,ఎంపీ రఘు నందన్ రావు,స్థానిక శాసనసభ్యులు రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐ జి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థకు వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఎంతో అంకిత భావంతో,క్రమ శిక్షణ తో ఉద్యోగాన్ని నిర్వహించాడన్నారు. ఎంపీ రఘు నందన్ రావు మాట్లాడుతూ ఎస్పీగా ఉదయ్ కుమార్ రెడ్డి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అమోఘమైన సేవలు అందించాలని గుర్తు చేశారు. బాధ్యత తో పోలీస్ ఉంద్యోగాన్ని నిర్వర్తించారని తెలిపారు. స్థానిక శాసన సభ్యులు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ గా సేవలు మరువలేనివి అన్నారు. జిల్లా ప్రజలు ఎప్పటికీ సేవలు మర్చిపోరని గుర్తు చేశారు.జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఉత్తమ సేవలందించారని, చాలా కార్యక్రమాల్లో, కలెక్టర్ ,ఎస్పీ కలసి పనిచేసినట్టు తెలిపారు. జిల్లా జడ్జి నీలిమ మాట్లాడుతూ రిటైర్మెంట్ అనేది సర్వసాధారణమని, రిటర్మెంట్ తర్వాత ఉత్తమ ఆరోగ్యకరమైన జీవితం కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్య వైద్యంతో రేణుక మృతికి కారణమైన ఆర్ఎంపి పై కేసు నమోదు

**ప్రథమ చికిత్స కేంద్రమును సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత**



కోనరావుపేట,31 మే (క్రాంతి న్యూస్ ): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన ఆర్ఎంపి లక్ష్మీనారాయణ నిర్లక్ష్య వైద్యంతో వంగపల్లి రేణుక అను మహిళకు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి మృతి చెందగా ఆర్ఎంపీ పై ఎఫ్ఐఆర్ తో పాటు, ప్రథమ చికిత్స కేంద్రమును సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎంపీలు సూదులు, సెలైన్లు ఇవ్వకుండా మెడికల్ కౌన్సిల్ నియమ నిబంధనల ప్రకారం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయవలసిందిగా సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్సిడి డాక్టర్ రామకృష్ణ, కోనరావు పేట మండల వైద్యాధికారి డాక్టర్ వేణుమాధవ్, కోనరావుపేట ఏఎస్ఐ తిరుమల బాబు పోలీస్ సిబ్బంది, డిప్యూటీ డెమో రాజకుమార్, రషీద్, మహేష్ గౌడ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల భద్రతే మా లక్ష్యం పరకాల ఏసీపి



పరకాల,31 మే (క్రాంతి న్యూస్ ): ప్రజల భద్రతే మా లక్ష్యం అని పరకాల ఏసీపి సతీష్ బాబు అన్నారు శనివారం సిపి సంప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సంయుక్తంగా పరకాల పట్టణంలో పోలీస్ కవాతు నిర్వహించారు ఈ కవాతులో ఏ ఆర్ ఎఫ్అధికారి సరస్వతితోపాటు పరకాల శాయంపేట ఆత్మకూరు సిఐలు, క్రాంతి కుమార్. రంజిత్ రావు. సంతోష్ ఎస్సైలు శివకుమార్ రమేష్ పరమేశ్వర్ కు అశోక్ తిరుపతి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కవిత వ్యవహారం.. అదంతా ఫ్యామిలీ డ్రామా:

### బండి సంజయ్



హైదరాబాద్ ,31 మే (క్రాంతి న్యూస్ ): భారాస ఎమ్మెల్సీ కవిత వ్యవహారం అంతా ఫ్యామిలీ డ్రామా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్ జరుగుతోందని ఎద్దేవా చేశారు. "భారాసలో చార్‌పత్తా ఆట నడుస్తోంది. కల్వకుంట్ల సినిమాకు ప్రొడక్షన్ చేస్తున్నది కాంగ్రెస్. భాజపా-భారాస ఎప్పుడూ కలవవు. కవిత అరెస్టు జరగకుండా ఉండేందుకు మా పార్టీతో కలిసేందుకు ప్రయత్నించారు. అవినీతి భారాసతో భాజపా కలవదు. కాంగ్రెస్-భారాస మాత్రమే కలిసి పనిచేశాయి.

వేములవాడ రాజన్న గోశాలలో కోడెలు చనిపోవడం బాధాకరం. ఈ ఘటనపై ఈవోతో మాట్లాడతాను. కోడెల సంఖ్యకు అనుగుణంగా గోశాలను విస్తరించాలి. రాజన్న ఆలయం నిధులను మాజీ సీఎం వేరే చోట ఖర్చు చేశారు. మన సైన్యం ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయి. పాక్‌పై యుద్ధం ఇంకా కొనసాగుతుందని ప్రధాని మోదీ చెప్పారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించే వరకు యుద్ధం కొనసాగుతుంది " అని బండి సంజయ్ అన్నారు.

మన క్రాంతి KR TV
# ఆరోగ్య క్రాంతి
ఆదివారం 01 జూన్ 2025
epaper.krtvnews.com

## బొబ్బర్లను రోజూ ఉడకబెట్టి తింటే ఇన్ని లాభాలా..? తెలిస్తే వెంటనే తింటారు..!

హెల్త్ న్యూస్,31 మే (క్రాంతి న్యూస్ ): ఏదైనా పండుగలు లేదా శుభ కార్యాల



సమయంలో చాలా మంది గారెలు తయారు చేసి తింటుంటారు. మొక్కజొన్న, బొబ్బర్లు, పెసలు, మినుములు వంటి వాటితో గారెలను తయారు చేస్తారు. కొన్ని ప్రాంతాలకు చెందిన వారు వీటినే వడలు అని కూడా పిలుస్తారు. అయితే గారెల తయారీకి ఎంచుకునే పప్పును బట్టి గారెల రుచి మారుతుంది. ఈ క్రమంలోనే చాలా మంది బొబ్బర్లను గారెలకు ఉపయోగిస్తుంటారు. ఇవి చాలా రుచిగా ఉంటాయి. అయితే బొబ్బర్లను వాస్తవానికి ఉడకబెట్టి రోజూ తినవచ్చు. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. బొబ్బర్లను ఉడకబెట్టి రోజూ ఒక కప్పు మోతాదులో స్నాక్స్ రూపంలో తింటుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇవి పలు వ్యాధులను నయం చేస్తాయని వారు అంటున్నారు.

**ప్రోటీన్లు సమృద్ధిగా..**

బొబ్బర్లలో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కనుక నాన్ వెజ్ తినలేని వారు బొబ్బర్లను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి కండరాలకు శక్తిని అందిస్తాయి. దీంతో శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. కండరాల నిర్మాణం జరుగుతుంది. రోజూ శారీరక శ్రమ లేదా వ్యాయామం అధికంగా చేసేవారు బొబ్బర్లను తింటుంటే కోల్పోయిన శక్తిని తిరిగి పొందుతారు. దీంతో మళ్లీ చురుగ్గా పనిచేస్తారు. బొబ్బర్లను ఒక కప్పు మోతాదులో ఉడకబెట్టి తింటే చాలు ఏకంగా 13 గ్రాముల మేర ప్రోటీన్లను పొందవచ్చు. కనుక ప్రోటీన్లకు వీటిని చక్కని వనరుగా చెప్పవచ్చు.

**జీర్ణ సమస్యలకు..**

బొబ్బర్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం, అజీర్తి వంటి సమస్యలు తగ్గేలా చేస్తుంది. బొబ్బర్లను ఆహారంలో భాగం చేసుకుంటే వాటిలో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దీంతో ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువు నియంత్రణలో ఉండేలా చేస్తుంది. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారు కచ్చితంగా బొబ్బర్లను ఆహారంలో భాగం చేసుకోవాలి. దీంతో ఎంతో మేలు జరుగుతుంది. బొబ్బర్లలో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోయేలా చేస్తుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

**షుగర్ ఉన్నవారికి..**


బొబ్బర్ల గ్లైసీమిక్ ఇండెక్స్ (జీఐ) విలువ చాలా తక్కువగా ఉంటుంది. కనుక వీటిని తిన్న వెంటనే షుగర్ లెవల్స్ పెరగవు. అందువల్ల మధుమేహం ఉన్నవారు సైతం బొబ్బర్లను నిరభ్యంతరంగా తినవచ్చు. పైగా వీటిలో ఉండే ఫైబర్ షుగర్‌ను తగ్గిస్తుంది. డయాబెటిస్‌ను అదుపులో ఉంచుతుంది. బొబ్బర్లలో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది. ఇది గర్భిణీలకు ఎంతో మేలు చేసే పోషక పదార్థం. దీంతో శిశువు ఎదుగుదల సరిగ్గా ఉంటుంది. పుట్టుక లోపాలు రాకుండా నివారించవచ్చు. శిశువుల్లో రక్తహీనత వంటి సమస్యలు రాకుండా చూస్తుంది. బొబ్బర్లను ఆహారంలో భాగం చేసుకుంటే యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా చూస్తాయి. ఇలా బొబ్బర్లను తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

## వయసు పెరిగే కొద్దీ కళ్ళు మసకబారతాయెందుకు?

హెల్త్ న్యూస్,31 మే (క్రాంతి న్యూస్ ): వయసు పెరిగే కొద్దీ మన శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. వాటిలో ముఖ్యమైనది కంటి చూపులో మార్పు. చిన్నప్పుడు స్పష్టంగా కనిపించినవి, వయసు పెరిగే కొద్దీ మసకబారడం, దగ్గరివి సరిగా కనిపించకపోవడం వంటివి సహజం. అయితే, ఈ మార్పులు ఎందుకు వస్తాయి? వీటిని ఎలా ఆలస్యం చేయవచ్చు? అనే విషయాలపై మెధావి స్కిల్స్ యూనివర్సిటీ పరిశోధకులు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు.

**కంటి చూపులో మార్పులు:**

మన కన్ను కాంతిని వంచే విధానంలో



మార్పుల వల్లే సాధారణ కంటి సమస్యలు వస్తాయి. ఇందులో మయోపియా (దగ్గరి చూపు), హైపర్‌మెట్రోపియా (దూరపు చూపు), మరియు ప్రెస్బియోపియా (వయసు పెరిగే కొద్దీ దగ్గరి వస్తువులపై దృష్టి పెట్టలేకపోవడం) వంటివి ఉంటాయి. పరిశోధన ప్రకారం, వయసు పెరిగే కొద్దీ కంటిలోని లెన్స్ బిగుసుకుపోవడం, దృష్టిని కేంద్రీకరించే కండరాలు బలహీనపడటం వల్ల కంటి చూపులో మార్పులు వస్తాయని డాక్టర్ అయన్ ఛటర్జీ వివరించారు.

**వివిధ వయసులలో కంటి చూపు:**

20లలో: ఈ వయసు వారిలో మయోపియా (దగ్గరి చూపు) ఎక్కువగా కనిపిస్తుంది. అధ్యయనం ప్రకారం, 30 ఏళ్ల లోపు వారిలో 28.5% మంది మయోపియాతో బాధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఎక్కువ సమయం స్క్రీన్ల ముందు గడపడం, అవుట్‌డోర్ కార్యకలాపాలు తగ్గడం అని డాక్టర్ ఛటర్జీ తెలిపారు.

30లలో, 40లలో: 30లలో హైపర్‌మెట్రోపియా (దూరపు చూపు) సాధారణమవుతుంది. చిన్న అక్షరాలు చదవడానికి ఇబ్బంది పడటం మొదలవుతుంది. 40లలో ప్రెస్బియోపియా (దగ్గరి చూపు మసకబారడం) వస్తుంది. పుస్తకాలు దూరం పెట్టి చదవడం, ఫోన్‌లోని అక్షరాలను పెద్దవిగా చేయడం వంటివి ఈ దశలో కనిపిస్తాయి.

**కంటి పరీక్షలు ఎందుకు ముఖ్యం?**

ఈ మార్పులు క్రమంగా జరుగుతాయి కాబట్టి, దృష్టి గణనీయంగా క్షీణించే వరకు మీరు వాటిని గమనించకపోవచ్చు. అందుకే సాధారణ కంటి పరీక్షలు చాలా అవసరం. "సకాలంలో సరైన లెన్స్‌లను సూచించడం ద్వారా కంటి చూపును కాపాడవచ్చు, మరింత క్షీణించకుండా నిరోధించవచ్చు" అని డాక్టర్ ఛటర్జీ సూచించారు.

**కంటి ఆరోగ్యాన్ని కాపాడటానికి చిట్కాలు:**

వార్షిక కంటి పరీక్షలు: మీ కంటి చూపు బాగానే ఉందని భావించినా, ఏటా కంటి పరీక్ష చేయించుకోండి.

స్క్రీన్ సమయం తగ్గించండి: స్క్రీన్ సమయాన్ని తగ్గించి, ప్రతి 20 నిమిషాలకు ఒకసారి 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు చూడండి (20-20-20 నియమం).

బహిరంగ కార్యకలాపాలు: ముఖ్యంగా పిల్లలు, యువకులు బయట ఎక్కువ సమయం గడపడం వల్ల మయోపియాను నివారించవచ్చు.


లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దు: మసకబారిన దృష్టి, కంటి ఒత్తిడి లేదా తలనొప్పి వంటివి కంటి సమస్యలకు తొలి సంకేతాలు కావచ్చు.

సరియైన లెన్స్‌లు వాడండి: వైద్యులు సూచించిన కళ్లద్దాలు లేదా కాంటాక్ట్ లెన్స్‌లను తప్పనిసరిగా వాడాలి.

మీ కళ్ళు ఎల్లప్పుడూ ఒకేలా ఉండవు. అవి నిరంతరం మారుతూ ఉంటాయి. ప్రారంభ దశలోనే గుర్తించడం, సరళమైన మార్పులు చేసుకోవడం ద్వారా మన కళ్ళను ఆరోగ్యంగా, స్పష్టంగా ఉంచుకోవచ్చు.

## ఉలవలు తింటే ఇన్ని లాభాలా..? ఈ అనారోగ్యాలన్నీ పరార్..!

హెల్త్ న్యూస్,31 మే (క్రాంతి న్యూస్ ): ఉలవలు ఎంతో ఆరోగ్యకరం. వీటిని క్రమంగా తీసుకోవటం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలుంటాయి. ఉలవల్లో ప్రోటీన్లు, ఐరన్, క్యాల్షియం, ఫాస్ఫరస్, ఫైబర్ అధికంగా ఉంటాయి. వీటిని తీసుకోవటం వల్ల పోషకాహార లోపం సమస్యను అధిగమించవచ్చు. శరీరంలోని చక్కెర స్థాయిలను తగ్గించడంలో ఉలవలు ఎంతో మేలు చేస్తాయి. ఇవి డయాబెటిస్‌ను నియంత్రణలో ఉంచుతాయి. ఉలవలు తీసుకోవడం వల్ల అధిక ఫైబర్ కంటెంట్ ఉన్నాయి. దీనిలో యాంటీ- హైపర్ కొలెస్ట్రాలెమిక్ లక్షణాలు



లభిస్తుంది. ఫలితంగా మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం దొరుకుతుంది. మన ఆరోగ్యానికి అవసరమైన అనేక పోషకాలు ఉలవలలో పుష్కలంగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఫైబర్ ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, ఐరన్, పాస్ఫరస్, జింక్, అడిపోజెనిక్, యాంటీ- యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా యాంటీ-హైపర్గ్లైసీమిక్, యాంటీ-

ఉన్నాయి. చలికాలంలో ఉలువలు తీసుకుంటే.. శ్వాస సమస్యలు తగ్గుతాయి. కఫం సమస్యలు కూడా రావు. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉలవలు ఆకలిని పెంచుతాయి. పిల్లలకు ఉలవులు పెడితే మంచిది.

ఉలువలను డైట్ లో చేర్చుకోవటం వల్ల మూత్రాశయ సమస్యలు తగ్గుతాయి. నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉలవల్లో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. వీటిని డైట్ లో చేర్చుకోవటం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. ఉలవలు జీర్ణ ప్రక్రియను మెరుగుచేస్తాయి. మలబద్ధకం, గ్యాస్ వంటి జీర్ణవ్యవస్థ సమస్యలను నివరిస్తుంది. కిడ్నీల్లో రాళ్ల సమస్యతో బాధపడేవారికి ఉలవలు ఎంతో బాగా ఉపయోగపడతాయి. బరువు



KR TV క్రాంతి
ఆదివారం 01 జూన్ 2025

# క్రీడలు

epaper.krtvnews.com



## బుమ్రా బౌలింగ్ కోటా పూర్తి కానంత వరకూ..
## మ్యాచ్ ముగియనట్లే: ఏబీ డివిలియర్స్

స్పోర్ట్స్ న్యూస్,31 మే (క్రాంతి న్యూస్ ): ఐపీఎల్ 2025లో భాగంగా ముంబయి ఇండియన్స్ గుజరాత్ టైటాన్స్ మధ్య శుక్రవారం ఎలిమినేటర్ మ్యాచ్ జరిగింది. ఈ



పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి, గుజరాత్ ముందు 228 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఛేజింగ్‌లో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 208 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో ముంబయి ఇండియన్స్ 20 పరుగుల తేడాతో ఈ మ్యాచ్‌ను గెలిచింది. పంజాబ్ కింగ్స్‌తో క్వాలిఫయర్ 2 ఆడేందుకు అర్హత సాధించింది. పరాజయం పాలైన గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఈ మ్యాచ్‌లో జస్ప్రీత్ బుమ్రా కీలక సమయంలో వాషింగ్టన్ సుందర్‌ను తన అద్భుతమైన యార్కర్‌తో 48 పరుగుల వద్ద క్లీన్‌బౌల్డ్ చేశాడు. నాలుగో వికెట్‌కు సాయిసుదర్శన్‌తో కలిసి అతడు నెలకొల్పిన 84 పరుగుల భాగస్వామ్యానికి తెర దించాడు. ఇదే మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఈ విషయమై దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ ఓ లైవ్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంతో మాట్లాడాడు. "బుమ్రాకు సరైన సమయంలో ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ బంతిని అందించాడు. సాయి సుదర్శన్ అతడి బౌలింగ్‌లో బాగా ఆడాడు. అందుకే బుమ్రాతో కాస్త ఆలస్యంగా బౌలింగ్ చేయించాడు. ఎప్పుడైతే జస్ప్రీత్ బుమ్రా తన కోటాలో మిగిలిన రెండు ఓవర్లు వేయడానికి వచ్చాడో.. అప్పుడే నా కుమారుడితో నేను.. 'అతడి బౌలింగ్ పూర్తయ్యేంత వరకు, ఈ మ్యాచ్ ముగియనట్లే' అన్నాను. తాను ఎందుకు అత్యుత్తమమో బుమ్రా ఈ మ్యాచ్‌లో మరోసారి నిరూపించుకున్నాడు' అని ఏబీ డివిలియర్స్ అన్నాడు.

అలాగే ఈ సీజన్లో భీకర ఫామ్‌లో ఉన్న సాయిసుదర్శన్ వికెట్ కోల్పోవడంపై కూడా అతడు మాట్లాడాడు. 'రిచర్డ్ గ్లీసన్ బౌలింగ్‌లో 16వ ఓవర్లో సాయిసుదర్శన్ (80) పెవిలియన్ బాటపట్టాడు. ఇది కూడా మ్యాచ్‌కు మరో టర్నింగ్ పాయింట్. ఈ కీలకమైన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ఏదీ తమకు అనుకూలంగా జరగలేదు. వాళ్లు మూడు క్యాచ్‌లు డ్రాప్ చేశారు. కుశాల్ మెండిస్ హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు' అని డివిలియర్స్ ముగించాడు.

## రషీద్ ఖాన్ అత్యంత చెత్త రికార్డు..

స్పోర్ట్స్ న్యూస్,31 మే (క్రాంతి న్యూస్ ): రషీద్ ఖాన్.. ప్రపంచంలోనే అత్యుత్తమ



స్పిన్నర్లలో ఒకడిగా పేరు గాంచాడు. తన స్పిన్ మయాజాలంతో ప్రత్యర్థులను ముప్పు తిప్పలు పెట్టే సత్తా ఉన్నోడు రషీద్. కానీ ఐపీఎల్-2025లో మాత్రం రషీద్ తన మార్క్‌ను చూపించలేకపోయాడు. ఈ ఏడాది సీజన్‌లో అఫ్గాన్ స్టార్ స్పిన్నర్ దారుణంగా విఫలమయ్యాడు.

ప్రతీ మ్యాచ్‌లోనూ భారీగా పరుగులు సమర్పించుకుంటూ జట్టుకు భారంగా మారాడు. శుక్రవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఎలిమినేటర్‌లోనూ అదే తీరును కనబరిచాడు. తన నాలుగు ఓవర్లలో కోటాలో వికెట్ ఏమీ తీయకుండా 31 పరుగులు ఇచ్చాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది సీజన్‌లో 15 మ్యాచ్‌లు ఆడిన రషీద్.. 9.34 ఏకానమీతో కేవలం 9 వికెట్లు మాత్రమే పడగొట్టాడు.

రషీద్ ఖాన్ చెత్త రికార్డు..

ఈ క్రమంలో రషీద్ ఖాన్ అత్యంత చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు సమర్పించుకున్న బౌలర్‌గా రషీద్ అప్రతిష్టను మూటకట్టుకున్నాడు. ఈ ఏడాది సీజన్‌లో రషీద్ ఏకంగా 33 సిక్సర్లు ఇచ్చాడు. ఇప్పటివరకు ఈ రికార్డు టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ పేరిట ఉండేది.

2022 ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీకి ప్రాతినిథ్యం వహిస్తూ సిరాజ్ 31 సిక్సర్లు ఇచ్చాడు. తాజా మ్యాచ్‌లో రెండు సిక్సర్లు ఇచ్చిన రషీద్.. సిరాజ్‌ను అధిగమించాడు. వీరిద్దరి తర్వాత స్థానాల్లో చాహల్(30), హసరంగా(30),బ్రావో ఉన్నారు. కాగా ఎలిమినేటర్ మ్యాచ్‌లో 20 పరుగుల తేడాతో గుజరాత్ ఓటమి పాలైంది.

## గంభీర్ సెలక్ట్ చేయడు.. రిజెక్ట్ మాత్రమే చేస్తాడు: అతుల్ వాసన్

స్పోర్ట్స్ న్యూస్,31 మే (క్రాంతి న్యూస్ ): టీమ్ఇండియా( జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఇందులోభాగంగా అయిదు టెస్టుమ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈనేపథ్యంలో ఇటీవలే ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న భారత జట్టును బీసీసీఐ సెలక్టర్లు ప్రకటించారు. ఇందులో శ్రేయస్ అయ్యర్‌కు స్థానం దక్కలేదు. నిజానికి అతడు మంచి ఫామ్‌లో ఉన్నాడు. ప్రస్తుత ఐపీఎల్‌లోనూ చక్కగా రాణిస్తున్నాడు. అయినా జట్టులో చోటు దొరకలేదు. ఇదే విషయమై విలేకర్లు ప్రశ్నిస్తే బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అసలు కారణం ఏంటో



వివరించే ప్రయత్నం చేశాడు. కానీ టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం 'నేను సెలక్టర్‌ను కాదు..' అని జవాబిచ్చాడు.

టీమ్ఇండియా మాజీ పేసర్ అతుల్ వాసన్ ఒక ఓటీటీ షోలో ఈ అంశం మీద మాట్లాడుతూ 'గంభీర్ సెలక్ట్ చేయడు.. కేవలం రిజెక్ట్ మాత్రమే చేస్తాడు' అంటూ చురకలంటించాడు. భారత జట్టు ఎంపికలో కోచ్‌కు కూడా కీలక పాత్ర ఉంటుందని వివరించాడు. శ్రేయస్ అయ్యర్‌ను టీమ్‌లోకి ఎందుకు తీసుకోలేదో అతడు వివరంగా చెప్పి ఉండాల్సిందని ఈసందర్భంగా అతుల్ వాసన్ అన్నాడు. శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేయకపోవడంపై పలువురు క్రీడాభిమానులు, విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. మంచి ఫామ్‌లో ఉన్న అతడికి జట్టులో చోటు కల్పించకపోవడం సరైన నిర్ణయం కాదంటున్నారు.

## ప్రిక్వార్టర్స్‌లో సబలెంక, స్వియాటెక్

స్పోర్ట్స్ న్యూస్,31 మే (క్రాంతి న్యూస్ ): ప్రపంచ నంబర్‌వన్ అరియాన సబలెంక,



డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లోకి అడుగుపెట్టారు. వీరిద్దరితో పాటు నాలుగో సీడ్ పావొలిని, ఎనిమిదో సీడ్ క్విన్‌వెన్ జెంగ్, 12వ సీడ్ రిబాకినాలు కూడా ప్రిక్వార్టర్స్ చేరారు. పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ లారెంజో ముసెట్టి, పదో సీడ్ హోల్గర్ రూన్‌లు కూడా ప్రిక్వార్టర్స్ సమరానికి అర్హత సంపాదించారు. పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యూకీ బాంబ్రీ తన అమెరికన్ భాగస్వామితో కలిసి ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు.

అలవోక విజయంతో...

మహిళల సింగిల్స్‌లో శుక్రవారం జరిగిన మూడో రౌండ్ పోటీల్లో నిరుటి క్వార్టర్ ఫైనలిస్ట్, తాజా ఆస్ట్రేలియన్ ఓపెన్ రన్నరప్ సబలెంక (బెలారస్) 6-2, 6-3తో సెర్బియన్ ప్లేయర్ ఓల్గా దానిలోవిచ్ అలవోక విజయం సాధించింది. కేవలం గంటా 19 నిమిషాల్లోనే సెర్బియన్ ప్రత్యర్థి ఆట కట్టించింది. గతేడాది ప్రిక్వార్టర్ ఫైనల్ దాకా పోరాడిన ఓల్గా ఈసారి మూడో రౌండ్లోనే ఇంటిదారి పట్టింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో హ్యాట్రిక్ చాంపియన్ (2022, 2023, 2024), పోలండ్ స్టార్ స్వియాటెక్ వరుసగా నాలుగో టైటిల్ దిశగా అడుగులు వేస్తోంది.

మూడో రౌండ్లో ఐదో సీడ్ స్వియాటెక్ 6-2, 7-5తో జాక్వెలైన్ క్రిస్టిన్ (రొమేనియా)పై గెలుపొందగా, నిరుటి రన్నరప్, నాలుగో సీడ్ జాస్మిన్ పావొలిని (ఇటలీ) 6-4, 6-1తో ఉక్రెయిన్‌కు చెందిన యులియా స్టారొడుత్సెవాను ఓడించింది. 12వ సీడ్ ఎలీనా రిబాకినా (కజకిస్తాన్) 6-2, 6-2తో జెలీనా ఒస్టాపెంకో (లాత్వియా)పై గెలుపొందగా, ఆస్ట్రేలియన్ ఓపెన్ మాజీ రన్నరప్, చైనా స్టార్ క్విన్‌వెన్ జెంగ్ 6-3, 6-4తో విక్టోరియా ఎంబ్‌కో (కెనడా)పై విజయం సాధించింది.

చెమటోడ్చిన రూన్

పురుషుల సింగిల్స్‌లో జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో హోల్గర్ రూన్ (డెన్మార్క్) 4-6, 6-2, 5-7, 7-5, 6-2తో క్వెంటిన్ హలైస్ (ఫ్రాన్స్)పై చెమటోడ్చి నెగ్గాడు. ఎనిమిదో సీడ్ లారెంజో ముసెట్టి (ఇటలీ) 4-6, 6-4, 6-3, 6-2తో మరియానో నెవాన్ (అర్జెంటీనా) గెలుపొందగా, 12వ సీడ్ టామీ పాల్ (అమెరికా) 6-3, 3-6, 7-6 (9/7), 3-6, 6-3తో కరెన్ కచనొవ్ (రష్యా)పై పోరాడి గెలిచాడు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ జోడీ

భారత డబుల్స్ టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లాడు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్లో యూకీ-గాలోవే (అమెరికా) ద్వయం 6-7 (4/7), 7-6 (7/4), 6-3తో ఏడో సీడ్ నికోల మెక్టిక్ (క్రొయేషియా)-మైకేల్ వీనస్ (ఆస్ట్రేలియా) జంటపై ఆఖరిదాకా పోరాడి గెలిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ-గాలోవే జోడీ... అమెరికాకు చెందిన తొమ్మిదో సీడ్ క్రిస్టిన్ హ్యారీసన్- ఇవాన్ కింగ్ జంటతో తలపడుతుంది.

KR TV క్రాంతి
# సినిమా న్యూస్
epaper.krtvnews.com

## చిరు- అనీల్ మూవీ ఫస్ట్ షెడ్యూల్ పూర్తి.. విశ్వంభర జాడే లేదేంటి..!



మెగాస్టార్ చిరంజీవి కుర్ర హీరోలకి పోటీగా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటించిన విశ్వంభర ఎప్పుడో విడుదల కావలసి ఉన్నా, వీఎఫ్ఎక్స్ వర్క్స్ వలన వాయిదా పడుతుందని అంటున్నారు. మల్లిడి వశిష్ఠ డైరెక్షన్‌లో, యూవీ క్రియేషన్స్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ సోషియో-ఫాంటసీ యాక్షన్ చిత్రంలో త్రిష కథానాయికగా నటించింది. కునాల్ కపూర్, ఆషికా రంగనాథ్ కీలక పాత్రల్లో నటించారు. ఎప్పుడో ఈ చిత్రం విడుదల కావలసి ఉన్నా ఈ సినిమా టీజర్‌లో వీఎఫ్ఎక్స్ నాణ్యతపై విమర్శలు రావడంతో, చిరంజీవి కొత్త టీమ్‌ను తీసుకొచ్చి మూవీకి మెరుగులు దిద్దిస్తున్నట్టు తెలుస్తుంది.

విశ్వంభర సినిమా విడుదలను సెప్టెంబర్ 2025కి వాయిదా వేసే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్టు ఇటీవల వార్తలు వచ్చాయి. కాని ఇప్పటి వరకు మూవీ జాడే లేదు. ఈ ఆలస్యం అభిమానులను నిరాశపరుస్తున్నప్పటికీ, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా సినిమాను అందించాలని చిరంజీవి భావిస్తున్నారట. ఈ సినిమా బడ్జెట్ రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. మరోవైపు విశ్వంభర షూటింగ్ ఎప్పుడో పూర్తి చేసిన చిరంజీవి ఇప్పుడు అనీల్ రావిపూడి దర్శకత్వంలో మూవీ చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ జెట్ స్పీడ్ లో దూసుకుపోతుంది. ఆల్రెడీ మొదటి షెడ్యూల్ షూటింగ్ ను కూడా ఫినిష్ చేసుకుందట ఈ మూవీ. ఈ స్పీడ్ చూస్తుంటే అనీల్ రావిపూడి అనుకున్న దాని కన్నా ముందే ప్యాకప్ చెప్పేలా ఉన్నాడుగా

రెండో షెడ్యూల్ ను కూడా రెడీ చేసేస్తున్నట్టు తెలుస్తుండగా ఈ మూవీ వచ్చే ఏడాది సంక్రాంతికి బాక్సాఫీస్ దగ్గర సందడి చేసేందుకు సిద్ధమైంది. 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో సీనియర్ హీరో వెంకటేష్‌ని రూ.300 కోట్ల క్లబ్ చేర్చిన అనిల్ రావిపూడి మెగాస్టార్ ఎలా చూపిస్తాడోనని మెగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వినోదంతో పాటు బలమైన భావోద్వేగాలు నిండిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కిస్తున్నట్టు చెబుతున్నారు. ఇక ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో నటించడం ఖాయమైంది. దీంట్లో ఆయనది అతిథి పాత్రేం కాదని.. చాలా ప్రాధాన్యమున్న పాత్రని తెలిసింది. ఈ మూవీతో చిరు బడా హిట్ కొట్టడం ఖాయం అంటున్నారు.

## ఆ భారాన్ని మాత్రం మోయకండి : రష్మిక



జీవితంలో ఏదీ శాశ్వతం కాదని అర్థం చేసుకుంటే ఒత్తిడి ఉండదన్నారు నటి రష్మిక . ఆమె నటించిన ఛావా మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత విడుదలైన 'సికందర్' మాత్రం ఆశించిన స్థాయిలో అలరించలేకపోయింది. తాజాగా ఈ విషయంపై రష్మిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తన కెరీర్, ఒత్తిళ్ల గురించి ప్రస్తావించారు.

"జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే విషయం నాకు తెలుసు. గతంలోనూ నేను ఇదే అంశం గురించి పలుమార్లు మాట్లాడాను. ఒకరోజు మనకు అనుకూలంగా అనిపిస్తుంటుంది. మరుసటి రోజు అంతా మారిపోతుంది. నేను ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా నా కుటుంబం, స్నేహితుల నుంచి మద్దతు ఉండడం నా అదృష్టం. ఒడుదొడుకులను ఎదుర్కోవడంలో ఎప్పుడూ అండగా ఉంటారు. నిజం చెప్పాలంటే నటిని అవుతానని ఎప్పుడూ అనుకోలేదు. ఈ రంగంలోకి రావడానికి ప్రణాళికలు వేసుకోలేదు. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే నేను ఎంత అదృష్టవంతురాలినో అర్థమవుతుంది" అని చెప్పారు.

"కెరీర్ విషయంలో నేను ఎప్పుడూ స్థిరంగా ఉంటాను. అందరికీ ఇచ్చే సలహా కూడా ఇదే. మనసుకు నచ్చిన పని చేయాలి. కూర్గ్ లాంటి చిన్న పట్టణంలో పుట్టిన నేను.. నేడు ఈ స్థాయిలో ఉన్నానంటే అదే కారణం. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకుసాగాలి. ఈ ప్రయాణంలో కఠినమైన పాఠాలు ఉండవు.. అన్నీ విలువైనవే ఉంటాయి. ఎల్లప్పుడూ ఉత్తమంగా ఉండడానికి ప్రయత్నించండి కానీ.. ఇతరులను సంతోషపెట్టాలనే భారాన్ని మాత్రం మోయకండి. మీ ఆనందంపై దృష్టిపెట్టండి" అని రష్మిక సలహా ఇచ్చారు.

## వైరలవుతోన్న శ్రీలీల ఫొటోలు..



నటి శ్రీలీల పేరు ఒక్కసారిగా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది. తాజాగా ఇన్‌స్టాలో ఆమె షేర్ చేసిన ఫొటోలు వైరల్ కావడంతో ఆమె పేరు నెట్టింట తెగ వినిపించేస్తోంది. పెద్దవాళ్లు ఆమెకు పసుపు పూసి ఆశీర్వదిస్తున్న ఫొటోలు షేర్ చేసిన శ్రీలీల.. 'బిగ్ డే', 'కమింగ్ సూన్' అనే క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆమె సైలెంట్‌గా నిశ్చితార్థం చేసుకున్నారంటూ కథనాలు వెలువడుతున్నాయి. మరికొందరు మాత్రం ఆమె ఏదైనా వాణిజ్య ప్రకటన కోసం ఇలా రెడీ అయిఉంటారని అభిప్రాయపడుతున్నారు.

అయితే, నటి ఎంగేజ్‌మెంట్ వార్తల్లో నిజం లేదని సమాచారం. ఏ చిన్న వేడుకనైనా ఆమె ఇంట సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. వచ్చే నెలలో ఆమె పుట్టినరోజు రానుండడంతో ముందస్తుగా ఓ చిన్న వేడుకను నిర్వహించినట్లు సమాచారం. ఈ ఫొటోలపై క్లారిటీ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

నటిగా రాణిస్తోన్న శ్రీలీల.. ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతోన్న విషయం తెలిసిందే. చదువుతోపాటే కెరీర్‌లోనూ కొనసాగడంపై ఎన్నో సందర్భాల్లో ఆమె ఆనందం వ్యక్తంచేశారు. దక్షిణాదిలో హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. బాలీవుడ్‌లో తన సత్తా చాటుకునేందుకు సిద్ధమయ్యారు. అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఇందులో కార్తిక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్నారు.

## నన్ను మించిన నలుగురు నటులు దొరికితే సినిమాలు వదిలేస్తా : కమల్ హాసన్



తమిళంతో పాటు తెలుగు, హిందీ పరిశ్రమలో తన నటనతో లోకనాయకుడిగా తనదైన ముద్ర వేసుకున్న కమల్ హాసన్ తన సినీ ప్రస్థానంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే జనరేషనలో అయిన తనను మించిన నలుగురు నటులు కనిపిస్తే.. తాను నటనకు వీడ్కోలు చెబుతానని ప్రకటించారు. 70 ఏండ్ల వయసున్న ఈ నటుడు ప్రస్తుతం ఉన్న కుర్ర హీరోలకు పోటిగా తన సినిమాలను విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. కమల్ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం థగ్ లైఫ్. మణిరత్నం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. సింబు, త్రిష కృష్ణన్, అభిరామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 05న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ ప్రమోషన్స్‌లో పాల్గోన్న కమల్ తన రిటైర్మెంట్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇంతకుముందే తనకు 'రిటైర్మెంట్ అంటే మరణంతో సమానం' అని చెప్పిన కమల్ తాజాగా మరోసారి ఆ విషయంపై మాట్లాడాడు. ఇప్పుడు ఉన్న జనరేషన్ లేదా వచ్చే జనరేషన్‌లో అయిన తనను మించిన నలుగురు నటులు కనిపిస్తే.. తాను సినిమాలు వదిలేస్తానని కమల్ చెప్పుకొచ్చాడు. కాగా ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

## ఎట్టకేలకు ఓటీటీలోకి రజనీకాంత్ సినిమా.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!



విష్ణు విశాల్ విక్రాంత్ సంతోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లాల్ సలాం' . రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కింది. మొయిద్దీన్ అనే కీలక పాత్రలో రజనీకాంత్ నటించారు. గతేడాది ప్రారంభంలో థియేటర్‌లో విడుదలైన ఈ సినిమా ఎట్టకేలకు 16 నెలల తర్వాత ఓటీటీలోకి రానుంది. ఎన్నో వాయిదాల అనంతరం ఓటీటీ విడుదలకు లైన్ క్లియర్ అయింది. సన్ నెక్ట్స్ వేదికగా జూన్ 6 నుంచి అందుబాటులోకి రానుంది.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com